క్లుప్తంగా

నేడు ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు


సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి

కమలాపురం : పట్టణ పరిధిలోని సుంకులమ్మ ఆలయంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆలయ ఆవరణలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆర్ఎస్ ఇన్‌ఫ్రా యజమాని రామసుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఆయన హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న మల్లికార్జునరెడ్డిని వారు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడిని అనాథ శరణాలయానికి తరలింపు


వృద్ధుడిని అనాథాశ్రమానికి తరలిస్తున్న ఏఎస్ఐ రమణ, అభి ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు

కమలాపురం : పట్టణంలో గత కొన్నేళ్లుగా యాచక వృత్తి చేసుకుని జీవనం సాగిస్తున్న గోపాల్ (67) అనే వృద్ధుడిని తిప్పలూరు సమీపంలోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి తరలించారు. అనారోగ్య కారణంగా కొన్ని రోజులుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్కడి సిబ్బంది ఇచ్చే ఆహారాన్ని తీసుకుంటూ అక్కడే కాలం గడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఆసుపత్రి సిబ్బంది ఎస్ఐ విద్యాసాగర్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ ఆదేశాల మేరకు ఏఎస్ఐ రమణ, అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్ బాబు అక్కడికి చేరుకుని వృద్ధుడితో మాట్లాడి అనాథాశ్రమానికి తరలించారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధనతోపాటు సౌకర్యాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల, మైలవరం మండలంలోని గురుకుల పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉత్తర కాలువకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడండి


రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వేంపల్లె : రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఆర్ఎస్ గంగస్వామి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ రాజేంద్రలు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 100 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి నిండు ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ షాకీర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓంసాయి.. శ్రీసాయి జయజయసాయి


పులివెందులలో పల్లకి ఉత్సవంలో మహిళలు

పులివెందుల టౌన్ : పట్టణంలో గురువారం గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో వెలసిన శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకారాలు జరిగాయి. గ్రామోత్సవం నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారణలతో కళాకారుల నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

షిర్డిసాయిబాబాను దర్శించుకున్న ఎంపీ
పట్టణంలోని స్థానిక పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి షిర్డిసాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అలాగే సాయికృప లేఔట్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు విశేష పూజలు చేశారు. భక్తులకు బీవీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత బీవీ సుబ్బారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పులివెందుల రూరల్ : నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె, ఇ.కొత్తపల్లె గ్రామాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వేంపల్లెలో..
వేంపల్లె : స్థానిక కడప రోడ్డులోని షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

వీరపునాయునిపల్లెలో..
వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె, ఎన్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని శ్రీ శివకృష్ణ గోశాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

జమ్మలమడుగులో..
జమ్మలమడుగు : ముద్దనూరు రోడ్డులో ఉన్న సాయిబాబా దేవాలయం, కోవెలకుంట్ల రహదారిలో ఉన్న సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కోవెలకుంట్ల రహదారిలో ఉన్న సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, గిరిధర్ రెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న జ్ఞాన సాయిబాబా ఆలయంలో తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహాద్రిపురంలో..
సింహాద్రిపురం : సింహాద్రిపురంతోపాటు కసనూరు, బలపనూరు గ్రామాల్లోని షిర్డిసాయిబాబా ఆలయాలు, గురిజాల అవధూత అప్పస్వామి ఆలయాలలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సాయిబాబా చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

వేములలో..
వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లెలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కోలాటం భక్తులను ఆకట్టుకుంది. జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి దంపతులు సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు.


పులివెందులలో సాయిబాబాను దర్శించుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాలలో..
లింగాల : మండలంలోని వనంబావి సమీపంలో వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లింగాల, గుణకణపల్లె, రామట్లపల్లె గ్రామాల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చెక్క భజన కార్యక్రమాలను నిర్వహించారు.

ముద్దనూరులో..
ముద్దనూరు : గురుపౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. వ్యాసపూర్ణిమ సందర్భంగా గురువారం శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఉదయం శ్రీసాయిబాబా విగ్రహానికి అభిషేకం, అర్చన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక శ్రీసాయిబాబా ఆలయంలో భక్తులకు మధ్యాహ్నం ప్రసాదం పంపిణీచేశారు.


వేంపల్లెలో ప్రత్యేక అలంకరణలో షిర్డిసాయిబాబా


కోవెలకుంట్ల రహదారిలో ఉన్న సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ


పులివెందులలో దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

అర్హుల జాబితా ప్రదర్శన

వీరపునాయునిపల్లె : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అర్హుల జాబితాను అన్ని రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శించినట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం రైతుసేవా కేంద్రంలో అర్హుల జాబితాను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలో 6208 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా ఎంపికయ్యారని తెలిపారు. 125 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. అన్ని అర్హతలు ఉండి కూడా అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాలో పేర్లులేని రైతులు ఈనెల 13వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి సిబ్బందిని సంప్రదించాలన్నారు. అలాగే భూ సంబంధ కారణాలతో అనర్హులుగా ఉన్నవారు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి రెవెన్యూ రికార్డుల్లో తప్పులు సరిచేయించుకుంటే అర్హులవుతారని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

ముద్దనూరు : మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని ఎంపీడీవో రాధాకృష్ణాదేవి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యమివ్వాలని, చెత్తసేకరణ విధిగా చేపట్టాలని, పైప్ లీకేజీలను అరికట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా భవాని పీరు ఉత్సవం


పులివెందుల : గ్రామోత్సవంలో భవాని పీరు ఉత్సవం

పులివెందుల టౌన్ : కులమతాలకతీతంగా మొహర్రం పండుగ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలో భవాని పీరు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని పీర్ల చావిడిలో భవాని పీర్లను కొలువు తీర్చి ముస్తాబు చేశారు. అనంతరం పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. విచిత్ర వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భవాని పీరు తమ ఇంటికి ముందుకు రాగానే భక్తులు చక్కెర చదివింపులు ఇచ్చారు. పూలతో పీర్లను అలంకరించారు. కొంతమంది భక్తులు వెండి గొడుగులు చేయించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చక్కెర చదివింపులు ఇచ్చాక అందరికి పంచిపెట్టారు. ఈ పీర్ల ఉత్సవం మెయిన్ బజార్, శ్రీరామాహాల్ రోడ్డు, మారుతిహాల్ రోడ్, తదితర ప్రాంతాల్లో పీర్ల ఉత్సవం జరిగింది. హిందు, ముస్లింలు కలసి ఘనంగా జరుపుకున్నారు.

లింగాలలో..
లింగాల : మండల కేంద్రమైన లింగాలలో గురువారం రాత్రి మొహర్రం ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పాత మస్తాన్‌స్వామి, మౌలాలిస్వామి పీర్లను డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. డీజే సౌండ్లతో రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తూ కోలాహలంగా మొహర్రం ఉత్సవాలు నిర్వహించారు. అంతకమునుపు పీర్లను అగ్ని గుండ ప్రవేశం చేశాయి. డీజే డ్యాన్స్ రికార్డింగ్ చూసేందుకు వందలాది మంది జనం తరలివచ్చారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి


నినాదాలు చేస్తున్న సీఐటీయూ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు

వేంపల్లె : రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు కోరారు. గురువారం వేంపల్లెలోని స్థానిక ఉర్దూ షాదీఖానాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంస్థ) వేంపల్లె సబ్ డివిజన్ కమిటీ సమావేశం ఎద్దుల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల సమస్యలపై ఆగస్టు 8న చేపట్టే చలో విద్యుత్ సౌధాను కార్యక్రమాన్ని కార్మికులందరూ విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్‌ను కార్మికులకు ఇవ్వాలని, అలాగే 2022 పీఆర్సీ, ఆరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలన్నారు. అలాగే కొత్త ఆపరేటర్లు అందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరిని స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని, ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌ను కూడా నియమించాలన్నారు. అలాగే అనారోగ్య పాలైన, యాక్సిడెంట్‌కు గురైన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు అన్ లిమిటెడ్ హెల్త్ కార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. సమావేశంలో పులివెందుల డివిజన్ కార్యదర్శి నరేంద్రనాథ్ రెడ్డి, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా భగవద్గీత పారాయణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక గీతా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. భగవద్గీత ధర్మప్రచార సమితి అధ్యక్షుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా నార్పలకు చెందిన బోనాల నారాయణప్ప భగవద్గీతలోని సాక్షాత్, పరమాత్మలోని 9వ అధ్యాయం రాజ విద్య, రాజ గుహ్య యోగం గురించి వివరించారు. కార్యక్రమంలో భగవద్గీత ధర్మ ప్రచార సమితి సభ్యులు మదూరు శేషయ్య, రాఘవరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యం

వేంపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా జాతీయ మహాసభలు జరగనున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం వేంపల్లెలోని స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన నల్లధనం వెలికితీత, పన్నుల తగ్గింపు, ఏడాదికి రూ.2 కోట్ల ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వీర్యంచేసి ప్రైవేట్ యూనివర్సిటీల పేరుతో అమ్మకానికి పెడుతోందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందించేందుకు నిధులు, నికరజలాలు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి


ప్రభుత్వాసుపత్రికి వితరణగా అందించిన ఫ్రిడ్జ్‌తో వైద్యులు

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లింగాల రామలింగారెడ్డి తన తండ్రి లింగాల గంగిరెడ్డి జ్ఞాపకార్థం ఫ్రిడ్జ్‌ను ఆసుపత్రికి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్, డాక్టర్ పవన్, సూర్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర ఉత్సవం

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామంలో గురువారం రాత్రి శ్రీపెనుగొండ బాబయ్య స్వామి జాతర పీర్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పీర్లచావిడి నుంచి పీర్లస్వాములను ఊరేగింపు ప్రారంభమైంది. అధికసంఖ్యలో భక్తులు జాతరపీర్లకు పూజలు చేశారు.

తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : పులివెందులలో జరిగిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి వేంపల్లి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు బయలుదేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటిక చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిస్సార్‌బాషా, గంగరాజు, చంద్ర గోపాల్‌రెడ్డి, పోలీసు గంగిరెడ్డి, ఆర్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, దస్తగిరి, రామసుబ్బయ్య, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చక్రాయపేట : మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గఫూర్, వేదమూర్తి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సభాపతి నాయుడు, రాంబాబు, వైఎఆర్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ ప్రధాన కార్యదర్శి ప్రసాదరావు, ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, పంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, యువజన విభాగం జిల్లాప్రధాన కార్యదర్శి రామాంజులరెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యవర్గభ్యుడు ఎల్ఎస్‌కృష్ణారెడ్డి మండలయూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సర్పంచులు లక్షుమయ్య, నరసింహులు, శంకర్‌రెడ్డి, గంగయ్య, మల్‌రెడ్డి, ఉత్తయ్య, అభిమానులు తరలివెళ్లారు.

లింగాల : లింగాల మండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌బాబురెడ్డి, రైతు విభాగపు నియోజకవర్గ కన్వీనర్‌సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంకిరెడ్డి, విశ్వరూప జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, గంగిరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, భూషణ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, విద్యానందరెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాము, గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కాటేశ్వర, గంగాధరరెడ్డి, పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డిలతోపాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేముల : మండల కమిటీ సభ్యులతోపాటు పంచాయతీరాజ్ వింగ్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మండలం నుంచి చంద్రశేఖరరెడ్డి, రాఘవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు చెన్నారెడ్డి, రంగనాథం, రామాంజనేయులు, మల్‌రెడ్డి, సాంబశివారెడ్డి, హరినాథరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఇసీ మహేశ్వరరెడ్డి, చలమారెడ్డి, విద్యా సాగర్‌రెడ్డిలతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు రామ్మోహన్ రెడ్డి, అరవిందనాథరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, శివారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి, నైజా సుబ్బారెడ్డి, ప్రహ్లాదారెడ్డి, మల్లికార్జునరెడ్డి, కంభం మహేశ్వరరెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, వెలుగోటి చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, పవన్ చంద్రారెడ్డి, రిషికేశవరెడ్డి, నర్సారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, బాబురెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బషీర్, చెన్నకేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హైటెక్ రవి, సాంబశివరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, సీకే బాబు, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొండూరు : మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు విజయ్‌శంకర్, నాగరాజు, సర్పంచ్‌లు రామసుబ్బారెడ్డి, గోపాల్, గంగయ్య, గురుమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, బాలగంగిరెడ్డి, మైసూరారెడ్డి, మండల రైతు సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కమిటీ మెంబర్లు విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, రమేష్, జేసీసీ కన్వీనర్ రజినికాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, గంగరాజు, శివశంకర్‌రెడ్డి, షఫి, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన 108 అంబులెన్స్



మొరాయించిన అంబులెన్స్‌ను తోస్తున్న ఆసుపత్రి సిబ్బంది

వేంపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల కొరకు ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తే వాటి కొనసాగింపుగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక కనీసం ఆ వాహనాలకు చిన్న, చిన్న మరమ్మతుపనులను కూడా చేయించలేకపోయారు. దీంతో 108 వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోయే పరిస్థితి నెలకొంది. వేంపల్లెలో ఉన్న 108 అంబులెన్స్‌కు సెల్ఫ్ మోటర్ పనిచేయకపోవడంతో ఎంతసేపటికి స్టార్ట్ కాలేదు. దీంతో ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వాహనాన్ని నెట్టే పరిస్థితి ఏర్పడింది. ఒకపక్క పేషంట్‌ను రిమ్స్‌కు తీసుకువెళ్లాల్సి ఉండగా అంబులెన్స్‌మొరాయించడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీతాలకోసం నిరసన


సీఈ వాసుదేవరావుతో చర్చిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులు తమకు జీతాలు ఇవ్వాలంటూ ఆర్టీపీపీ సీఈ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. పదవ తేదీ అవుతున్నా ఇంతవరకు తమకు జీతాలు ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గతంలో ఐదో తేదీ లోగా జీతాలు పడేవన్నారు. అనంతరం సీఈ వాసుదేవరావు కాంట్రాక్టు కార్మికులతో చర్చలు జరిపారు. అధికారులు తమకు 5వ తేదీలోగా జీతాలు వేయకపోవడంతో బ్యాంకుల్లో తెచ్చుకున్న రుణాలకు అదనపు వడ్డీతోపాటు చెక్ బౌన్స్ అయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అనంతరం సీఈ మాట్లాడుతూ కచ్చితంగా ఈ రోజే వేతనాలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన విరమింపజేశారు.

నాణ్యమైన విద్యనందించాలి


పులివెందులలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు


కమలాపురంలో జడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ వెంకటసుబ్బారెడ్డి

పులివెందుల టౌన్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పాఠశాల అందిస్తున్న సేవలను ఆయన కొనియారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌ను కళాశాల అధ్యాపకులు, అధికారులు సత్కరించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో పీటీఎం సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో
కమలాపురం : అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ యాజమాన్యాల కింద పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహణ అభినందనీయం అని మండల స్పెషలాఫీసర్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో హెచ్ఎం పర్వీన్ అధ్యక్షతన నిర్వహించిన పీటీఎంకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పాఠశాలలో పండుగ వాతావరణలో పీటీఎం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎంఈఓ బేబి మాట్లాడుతూ పిల్లలను స్కూల్‌కు పంపడమే తల్లిదండ్రుల బాధ్యత కాదని, ఇంటికి వచ్చాక చదివించే బాధ్యత కూడా తల్లిదండ్రులదేనన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం మొక్కలు నాటడం, తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అన్ని పాఠశాలల్లో అధికారులు, పీటీఎం నిర్వహించారు.

వేంపల్లెలో..
వేంపల్లె : గురుభక్తి కలిగి ఉండటం విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత సంస్కార లక్షణమని ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తి కడప మాజీ ప్రిన్సిపాల్ నెల్లూరు శివపార్వతి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, తెలుగు శాఖల ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శివపార్వతిని తాత్కాలిక ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు సత్కరించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ నాగాంజనేయులు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. సీఐ నరసింహులు, నియోజకవర్గ స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ కుళ్లాయమ్మలు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వెంకటరామిరెడ్డి, హాస్టల్ వార్డెన్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలలో
లింగాల : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించే బోధన, మధ్యాహ్న భోజన వసతి, పాఠశాలల్లో విద్యార్థులకు ఉన్న సౌకర్యాల గురించి చర్చించారు. అదేవిధంగా లింగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వ్యాయామం నిర్వహించేందుకు గ్రౌండ్ లేదని, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నా నూతన పాఠశాలను త్వరలో ప్రారంభిస్తే అన్ని సదుపాయాలు లభిస్తాయని ఎంఈఓ-2 రామకృష్ణయ్య అన్నారు.

తొండూరులో.
తొండూరు : పిల్లల విద్య అభివృద్ధిలో తల్లిదండ్రులు కీలకమని పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, తాడులాగు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ శ్రీ రమాదేవి, డిజిటల్ అసిస్టెంట్ మునీంద్రరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ లోకేశ్వర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.